# దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



రామడుగు : గోపాల్‌రావుపేటలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రామడుగు, అక్టోబర్16 : గోపాల్‌రావుపేట బస్టాండ్ సమీపంలో నేచర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో సోమవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిత్వికులు దుర్శేటి రవికిరణాచార్యులు, డింగిరి సత్యనారాయణాచార్యులు మహిళలు, దంపతులచేత పూజలు నిర్విహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం చిన్నారులను దుర్గామాతలుగా భావిస్తూ ప్రత్యేక పూజలు చేసి, కానుకలు సమర్పించారు. ఇక్కడ నేచర్ యూత్ క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాం గౌడ్, సభ్యులు కొలిపాక తిరుపతి, గడ్డం రత్నాకర్, బుర్ర శ్రీకాంత్‌గౌడ్, రణధీర్, రఘువీర్, దాసరి అనిల్, నేరెళ్ల అజయ్, రాజు, గాజరవేణి మహేశ్, బాలుసాని శ్రీనివాస్, కల్లెం అనిల్, సుద్దాల చందు ఉన్నారు.

**గాయత్రీ అవతారంలో అమ్మవారు**

చొప్పదండి, అక్టోబర్ 16: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా చొప్పదండి పట్టణంలో నెలకొల్పిన దుర్గామాత మండపాల్లో సోమవారం అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. గాజులమాలలతో అమ్మవారిని అలంకరించగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంతోష్‌నగర్ శివగణేశ్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద సాయిబాబా ఆలయం అర్చకుడు శ్యాం దంపతులు అన్నదానం చేశారు.

**మహేశ్వరి అలంకరణలో ..**

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 16: నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు మహేశ్వరి అలంకరణలో నంది వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు పవనకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయకమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కమాన్‌చౌరస్తా, అక్టోబరు 16 : చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో శైలపుత్రి



కరీంనగర్ రూరల్ : మహేశ్వరి అలంకరణలో

రూపంలో అమ్మవారు దర్శనమివ్వగా గాయత్రీ పూజ జరిపారు. లింగార్చన కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. యజ్ఞవరాహస్వామి క్షేత్రంలోని త్రికూటాలయంలో చతుర్ షష్ఠి పూజలు చేశారు. సర్వ వైదిక సంస్థానం ట్రస్ట్ ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం గాయత్రీనగర్‌లో అమ్మవారు గాయత్రీమాత అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ క్రమంలో కల్వకొలను చిత్తరంజన్ స్మారక సేవా సంస్థ వ్యవస్థాపకుడు కల్వకొలను శ్రీ రామ చంద్ర మూర్తి ఆధ్వర్యంలో శతకోటి గాయత్రి మహా మంత్ర జపయజ్ఞం నిర్వహించారు.

## పటాకుల దుకాణాలకు దరఖాస్తులు

రాంనగర్, అక్టోబర్ 16: దీపావళి సందర్భంగా తాత్కాలిక పటాకుల విక్రయ కేంద్రాల ఏర్పాటు కోసం వ్యాపారులు ఈ నెల 27 లోగా పోలీస్ కమిషనరేట్ ఆఫీస్ నందు దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయి నియమ నిబంధనలు , రక్షణ చర్యలు చేపట్టిన వారికే అనుమతులిస్తామని చెప్పారు. వ్యాపారులు ప్రభుత్వ శాఖల నిరభ్యంతర పత్రాలు పొందిన తర్వాతే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్ కార్డు, పదో తరగతి మెమో, రూ.500 చలానాను జతచేస్తూ ఐదు సెట్ల జిరాక్స్‌ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 27 తర్వాత అందజేసే దరఖాస్తులు స్వీకరించరని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో పటాకులు విక్రయంచేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

గంగాధర, అక్టోబర్ 16 : గర్శకుర్తికి చెందిన రేణిగుంట తిరుపతి ఆదివారం మరణించగా సోమవారం బంధువులు అంత్యక్రియలు నిర్వహించడానికి మృతదేహాన్ని వైకుంఠధామానికి తీసుకువెళ్లారు. మృతదేహాన్ని రథంపై నుంచి కిందికి దింపి దహనం చేయడానికి తీసుకెళ్తుండగా బంధువులు, గ్రామస్తులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేశాయి. దీంతో మృతదేహాన్ని అక్కడే వదిలేసి స్నానపు గదులు, విశ్రాంతి గదిలోకి దూరి తలదాచుకున్నారు. తేనెటీగల దాడిలో రేణికంట బాలాజీ, గుండా రాజేశం, బొల్లబత్తిని నర్సయ్యతో పాటు మరో 20 మందికిపైగా గాయాలపాలయ్యారు. పటాకులు కాల్చుతూ మృతదేహాన్ని అంతిమయాత్రగా తీసుకొస్తుండగా వైకుంఠధామం సమీపంలోని చెట్లపై ఉన్న తేనెటీగలు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.

## బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గంగాధర, అక్టోబర్ 16 : లింగంపల్లి వీడీసీ చైర్మన్ తోట నాంపెల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా సర్పంచుల ఫోరం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, సర్పంచులు వేముల దామోదర్, ముక్కెర మల్లేశం, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, కర్ర బాపురెడ్డి, వేముల అంజి, ముద్దం నగేశ్, పంజాల ఆంజనేయులుగౌడ్, సాగి అజయ్‌రావు, పడితెపల్లి కిషన్ ఉన్నారు.

## గుడి నిర్మాణ పనులకు భూమిపూజ

గంగాధర, అక్టోబర్ 16 : మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నడిపల్లి చింతలకుంటచెరువు కట్ట మైసమ్మ గుడి నిర్మాణ పనులకు నాయకుడు తూడి లచ్చయ్య సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇక్కడ సర్పంచ్ ఆకుల శంకరయ్య, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, టీఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో సుంకె ప్రచారం

రామడుగు, అక్టోబర్16 : బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ నేడు రామడుగు మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 7.30 గంటలకు రాంచంద్రాపూర్, చిప్పకుర్తికి 9 గంటలకు, గుండికి 10 గంటలకు, లక్ష్మీపూర్‌కు 11 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు వెంకట్రావుపల్లి లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

## పౌర హక్కులను కాలరాస్తున్న కేంద్రం

తెలంగాణచౌక్, అక్టోబర్16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని పౌరుల హక్కులను కాలరాస్తున్నదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో సోమవారం వారు మాట్లాడుతూ, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రజాసంఘాలు, మీడియాపై ఉపా చట్టాల పేరుతో కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ఐఏతో దాడులను కొనసాగిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రజా సంఘాలు, మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18 న ప్రెస్‌భవన్‌లో పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొనాలని కోరారు. పౌర హక్కుల సంఘం నాయకులు రవి, రాజేశం, పర్వతాలు, సుదర్శన్, రవీందర్ పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు ఉదయం కరీంనగర్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షకు 88 మంది విద్యార్థులకు 74 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ పరీక్షలో 106 మంది విద్యార్థులకు 79 మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం పదో తరగతి పరీక్షకు ఒక విద్యార్థి హాజరు కాగా, ఇంటర్ పరీక్షలో 10 మంది విద్యార్థులకు ఏడుగురు హాజరయ్యారు. మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు, జిల్లా విద్యాశాఖాధికారి తనిఖీలు నిర్వహించారు.

## శస్త్ర చికిత్స కోసం రక్తదానం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన మెరుగు నర్సయ్య కాలుకు శస్త్ర చికిత్సకు రక్తం అవసరం కాగా, కుటుంబీకులు అల్లు శిరీష్ అభిమాన సంఘం నాయకుడు చిలుక నరేందర్‌ను సంప్రదించారు. స్పందించిన నరేందర్ కాడె అశోక్, నాగెల్లి సంపతి ద్వారా సోమవారం రక్తదానం చేయించారు. రక్తదానానికి సహకరించిన అశోక్, సంపతిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా చిలుక నరేందర్ మాట్లాడుతూ, అత్యవసర, ఆపద సమయంలో ఎవరికి రక్తం అవసరమైనా ఆదుకోవడానికి ముందుంటామని తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చొప్పదండి, అక్టోబర్16 : చొప్పదండిలోని అంబేద్కర్‌నగర్ సీఎస్ఐ చర్చివద్ద సోమవారం పట్టణానికి చెందిన కడారి అభిషేక్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా, ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో ఆయన వద్ద రూ.27వేల విలువైన కిలో 80 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, చొప్పదండి నాయబ్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ గోపతి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ ఉపేంద్రాచారి మాట్లాడుతూ ఎవరైనా గంజాయి అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి

కార్పొరేషన్, అక్టోబర్ 16: పారిశుధ్య పనులను మరింతగా మెరుగుపర్చాలని, దీని కోసం నగరంలో డీఆర్‌సీసీలను పెంచాలని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగం అధికారులు, జవానులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో వంద శాతం చెత్త సేకరణ, కంపోస్టు యార్డుల ఏర్పాటు, హోం కంపోస్టు, డీఆర్‌సీసీల పెంపు, సెగ్రిగేషన్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విలీనమైన 8 గ్రామాల డివిజన్ల సహా 60 డివిజన్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ 100 శాతం చేపట్టాలన్నారు. కమర్షియల్ ఏరియాలో చెత్త కోసం వేర్వేరుగా చెత్త బుట్టలను ఏర్పాటు చేయాలని, రోడ్లపై చెత్త వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై చెత్త వేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానా విధించాలని సూచించారు. నగరంలో డీఆర్‌సీసీ సెంటర్లను ఐటీసీ మెప్మాతో కలిసి పెంచాలని పేర్కొన్నారు. తడి చెత్త కోసం పార్కులు, పాఠశాలలు, రిజర్వాయర్లు ఇతర చోట్ల వర్మి కంపోస్టు యార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి డివిజన్‌లో ఫిట్ కంపోస్టు యార్డులు ఏర్పాటు చేసేల చర్యలు తీసుకోవాలన్నారు. డంపు యార్డులో నోస్మోకింగ్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ ఎవరైనా స్మోకింగ్ చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం జరిమానా విధించాలని ఆదేశించారు. వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, ప్లాస్టిక్ వాడేవారిపై జరిమానా విధించాలన్నారు. సమావేశంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

## చేతుల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



జూనియర్ కళాశాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న క్లస్టర్ ఫెసిలిటేటర్

గంగాధర, అక్టోబర్ 16 : చేతుల పరిశుభ్రతతోనే సగం వ్యాధులను దూరం చేసుకుని ఆరోగ్యంగా ఉండవచ్చని యూనిసెఫ్ ప్రాజెక్ట్ క్లస్టర్ ఫెసిలిటేటర్ తాళ్ల వెంకటేశ్ పేర్కొన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐసీడీఎస్ కార్యాయంలో సోమవారం చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, మరుగుదొడ్లు వాటిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్లు రమాదేవి, సుధ, జయప్రద, కార్యదర్శి రాజ్‌కుమార్, అధ్యాపకులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గట్టుభూత్కూర్‌ను సందర్శించిన శిక్షణ అధికారులు



గంగాధర: గట్టుభూత్కూర్‌లో శిక్షణ అధికారులను సన్మానిస్తున్న సర్పంచ్ విజేందర్‌రెడ్డి

గంగాధర, అక్టోబర్ 16 : కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖలు చెందిన గ్రూప్–ఏ అధికారులు శిక్షణలో భాగంగా గట్టుభూత్కూర్ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలో ఐదు రోజుల పాటు గ్రామీణ, సామాజికాభివృద్ధికి సంబంధించిన అంశాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి అధ్యయనం చేస్తారని సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి తెలిపారు. అధికారులను సర్పంచ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్హోత్రా, ఉపసర్పంచ్ కాసారపు శైలజాశ్రీకాంత్, కార్యదర్శి సార్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, స్వశక్తి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాహెక్‌కొండాపూర్‌లో..

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 16: కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖలకు సంబంధించిన గ్రూప్ –ఏ అధికారులు శిక్షణలో భాగంగా సోమవారం తాహెక్‌కొండాపూర్‌ను సందర్శించారు. సెంట్రల్ సెక్రటేరియల్ సర్వీసెస్ అధికారులు ప్రియాశర్మ, అంకిత్ యాదవ్, ఖుషిమీనా, తుషార్ ప్రకాశ్ సింగ్, లక్షితాచౌహాన్, సుమన్‌శర్మ తదితరులు సామాజిక, రాజకీయాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐదు రోజుల పాటు అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడికంటి మమత, ప్రజాప్రతినిధులు వారిని సన్మానించారు. అనంతరం గ్రామ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, సంపత్‌కుమార్, మడికంటి మారుతి తదితరులు పాల్గొన్నారు.